క్లుప్తంగా

అంతర్వేదిలో నవ వార, నవ ప్రదక్షిణ దీక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నవ వార, నవ ప్రదక్షిణ దీక్షతో భక్తులు స్వామి అనుగ్రహం పొందవచ్చని, వారి కోరికలు నెరవేరుతాయని అర్చకులు, ఆలయ అధికారి తెలిపారు. ఈ మేరకు ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో ప్రతి బుధవారం 9 ప్రదక్షిణల చొప్పున 9 బుధవారాలు చేసి, 9వ బుధవారం స్వామివారి నారసింహ సుదర్శన హోమంలో పాల్గొంటే స్వామి అనుగ్రహం పొందవచ్చునని వివరించారు.

40 మందికి కంటి పరీక్షలు

కొత్తపేట: వానపల్లిలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు వైద్య పరీక్షా శిబిరం నిర్వహించారు. పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారి ధర్మవరపు కోటేశ్వరరావు ఆధ్వర్యాన 40 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 25 మందికి కళ్లజోళ్లు, ఆరుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు.

దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్

మలికిపురం: పూర్వ నుంచీ ఉన్న దస్తావేజుల స్వరూపాన్ని మార్చి ప్రైమ్ 2.0 కంప్యూటర్ విధానం అమలు చేయాలంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ దస్తావేజు లేఖర్లు మంగళవారం పెన్‌డౌన్ చేసి, నిరసన తెలిపారు. దస్తావేజులు, స్టాంపులను నిలిపివేయాలని నిర్ణయించడం తగదని పేర్కొన్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందించారు. దస్తావేజు స్వరూపాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు.

మోరి హైస్కూల్‌లో సీడ్ ప్రోగ్రాం

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు మంగళవారం స్పందన ఎడ్యుకేషన్, ఎంకరేజ్‌మెంట్ డీడ్ (సీడ్) ప్రోగ్రాం నిర్వహించారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్‌బాబు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ పి.వరప్రసాద్, పలువురు వక్తలు పాల్గొన్నారు. ఇంటర్ పర్సనల్ స్కిల్స్, ఫైనాన్షియల్ స్కిల్స్ తదితర జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం శ్రీధర్ కృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంబూషియా చేపల విడుదల

అయినవిల్లి: వీరవల్లిపాలెంలో గోదావరి వరద నీరు నిలిచిపోవడంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంది. వీటి నివారణకు వీరవల్లిపాలెం ప్రభుత్వ వైద్యుడు ఎస్.సునీల్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సూచన మేరకు గోతుల్లో నిలిచిన నీటిలో గంబూషియా చేపలను సర్పంచ్ సలాది బుచ్చిరాజు మంగళవారం వదిలారు.

గ్రామ, మండల కమిటీలు వేయాలి

అంబాజీపేట: గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలు వేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సంగీత సత్యనారాయణ అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ అధ్యక్షతన ఆ పార్టీ మండల సమావేశం మంగళవారం అంబాజీపేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఘనంగా సన్మానించారు.

ఆలయాల్లో అన్య మతస్తులు వద్దు

సఖినేటిపల్లి: హిందూ దేవాలయాల్లో అన్యమతస్తులను, నిందితులను బోర్డు సభ్యులుగా, ఉద్యోగులుగా నియమించరాదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. అంతర్వేది దేవస్థానం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యాన మంగళవారం మన దేవాలయం – మన హక్కు కార్యక్రమం నిర్వహించారు. భక్తుల నుంచి సంతకాలు సేకరించారు. అనంతరం గ్రామంలోని జీజేఎంలో నిర్మాణంలో ఉన్న చెరువు పనులను వేమా పరిశీలించారు. చెరువుకు ఉత్తరం వైపు గట్టుపై ఉన్న ప్రభుత్వ శిథిల భవనాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెంపాటి శివరామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యేక పూజలు

అంబాజీపేట: నందంపూడి శివారు పెచ్చెట్టివారిపాలెంలో బుధవారం శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి త్రిదిన దీక్షా ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, మార్జనలు, వాస్తు పూజ, వాస్తుబలి, వాస్తు హోమం, పర్యగ్నికరణం, క్షీరాధివాసం, జలాధివాసం, యాగశాల బలిహరణ, ఉదక శాంతి, పంచశయ్యాధివాసం, యాగశాలార్చన, మూర్తి హోమం, లక్ష్మీగణపతి హోమం తదితర హోమాలు జరిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెచ్చెట్టి లక్ష్మీ నాగేశ్వరరావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఉప్పలగుప్తం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, అమలాపురం ఆర్డీవో ఎస్ఎస్‌వీబీ వసంత రాయుడు మంగళవారం తనిఖీ చేశారు. మండలంలోని చల్లపల్లి, సరిపల్లి, విలసవిల్లి గ్రామాల్లో పర్యటించి ఓటరు జాబితాలను పరిశీలించారు. ఎస్.పల్లిపాలెంతో పాటు నక్కా రామేశ్వరం ఎంపీయూపీ స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు.

మాతృభాషను మరువరాదు

- తెలుగు భాషా దినోత్సవంలో ప్రముఖులు
- గిడుగు చిత్రపటాలకు నివాళి

మామిడికుదురు/అంబాజీపేట/పి.గన్నవరం/సఖినేటిపల్లి/ఆత్రేయపురం/ఆలమూరు: తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని, దీనిని నేటి యువతకు చాటి చెప్పాలని, మాతృభాషను మరువరాదని పిలుపునిచ్చారు.

- మామిడికుదురు జెడ్పీ హైస్కూలులో హెచ్ఎం సీహెచ్ నిరంజని ఆధ్వర్యాన విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రవాసాంధ్రుడు నయినాల శ్రీనివాస్ అందించిన నగదు ప్రోత్సాహకాలను ఆయన తండ్రి నయినాల తమ్మారావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ మట్టా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.
- అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో హెచ్ఎం కదలి సాయిరామ్, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు పెదమల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తెలుగు ఉపాధ్యాయులు నందిక వెంకటేశ్వరరావు, మట్టపర్తి శ్రీనివాసరావు, ముంజవరపు సూర్యనారాయణ ఆధ్వర్యంలో తెలుగు భాషలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తొండవరం, పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూళ్లలో కూడా తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.
- పి.గన్నవరం మండలం పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యాన విద్యార్థులకు తెలుగు పద్యాలు, నీతి వాక్యాలు, సామెతలు, సూక్తులు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం బహుమతులు అందజేశారు. తెలుగు కవుల గొప్పతనాన్ని ఉపాధ్యాయురాలు సీహెచ్‌బీ వరలక్ష్మి విద్యార్థులకు వివరించారు. పి.గన్నవరం జెడ్పీ హైస్కూలులో హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యాన తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.


మామిడికుదురులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాత తమ్మారావు



అంతర్వేది జెడ్పీ హైస్కూలులో తెలుగు తల్లి వేషధారణ, భువన విజయం నాటికలో పాత్రధారులు

- సఖినేటిపల్లి మండలం అంతర్వేది జెడ్పీ హైస్కూలులో హెచ్ఎం పి.సోమ సూర్యకుమారి ఆధ్వర్యాన విద్యార్థులు ప్రదర్శించిన తెలుగుతల్లి వేషధారణ, భువన విజయం నాటిక గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలుగు భాష ప్రాధాన్యాన్ని తెలుగు పండిట్ ఎ.భ్రమరాంబిక విద్యార్థులకు వివరించారు. గొంది జెడ్పీ హైస్కూలులో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. తెలుగు భాషా పరిజ్ఞానంతో పాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.
- ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, ఎంఈఓ ఐఐ పచ్చా సాహెబ్, పరిపాలనాధికారి టీవీ సురేంద్రరెడ్డి ఆధ్వర్యాన తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.
- ఆలమూరు మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓలు పి.సాలెంరాజు, సుబ్బరాజు పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయులు తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు సంప్రదాయాలు ఉట్టి పడేలా విద్యార్థులు కళారూపాలు, నాటికలు, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఓటర్ల జాబితా పరిశీలన


ఆలమూరులో ఓటర్ల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి మంగళవారం పర్యటించారు. ఓటర్ల జాబితాలో తొలగించిన పేర్లకు సంబంధించి, క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) ఇంటింటికీ వెళ్లి నిర్వహించిన సర్వేలో ఇప్పటికే మరణాలు, శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలను గుర్తించి, జాబితా నుంచి తొలగించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీనిపై ఆర్డీఓ ఈ పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లున్నా సత్వరమే సమీప రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐపీ శెట్టి, డిప్యూటీ తహసీల్దార్ పి.జానకి రామయ్య, రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.

సంక్షేమమే పరమావధి

- ఎమ్మెల్యే రాపాక
- పాలగుమ్మిలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజోలు: సంక్షేమమే పరమావధిగా రాష్ట్రంలో పాలన సాగుతోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. పాలగుమ్మి గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని రీతిలో గృహనిర్మాణ పనులు చేపట్టారని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్ద పీట వేశారని చెప్పారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటు చేసి, పాలనా వ్యవస్థలో మార్పులు చేయడంతో గ్రామ స్థాయిలోనే మెరుగైన సేవలు అందుతున్నాయని అన్నారు. తొలుత సర్పంచ్ అప్పారి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బత్తుల హేమ ఆధ్వర్యాన ఎమ్మెల్యే రాపాకకు ఘన స్వాగతం పలికారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, బి.సావరం సొసైటీ అధ్యక్షుడు కంచి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాపాక

అముడా చైర్మన్ డేవిడ్‌రాజుకు బ్రహ్మరథం

- అడుగడుగునా పార్టీ శ్రేణులు, ప్రజల ఘనస్వాగతం
- అమలాపురంలో ప్రమాణ స్వీకారానికి భారీ ఊరేగింపుగా పయనం

కొత్తపేట: అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్‌గా ప్రమాణ స్వీకారోత్సవానికి పయనమైన గొల్లపల్లి డేవిడ్‌రాజుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కొత్తపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ డేవిడ్‌రాజు తాజాగా అముడా చైర్మన్‌గా నియమితులైన విషయం తెలిసిందే. అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన భారీ ఊరేగింపుగా తరలి వెళ్లారు. తొలుత డేవిడ్‌రాజు నివాసానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ వచ్చి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానానికి చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ ఊరేగింపు ప్రారంభమైంది. గుర్రపు బగ్గీపై డేవిడ్‌రాజుతో పాటు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీ చింతా అనురాధ, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు తదితరులు ఎక్కారు. అక్కడి నుంచి భారీ బాణసంచా కాల్పుల నడుమ కౌశిక రోడ్డు, పోస్టాఫీస్, కొత్త బస్టాండ్ సెంటర్, బంగారమ్మ గుడి, కొత్త రామాలయం, పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ డేవిడ్‌రాజుతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తదితర నేతల విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఊరేగింపుగా డేవిడ్‌రాజు నివాసం సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, డేవిడ్‌రాజులకు అభిమానులు క్రేన్‌తో భారీ గజమాల వేసి అభిమానం చాటుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించి వాహనం పైకి డేవిడ్‌రాజు, ఎంపీ, ఎమ్మెల్యేలు మారగా ఊరేగింపు తిరిగి ప్రారంభమైంది. ఊరేగింపులో అడుగడుగునా డేవిడ్‌రాజుకు ప్రజలు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. పనసలదొడ్డి సెంటర్‌లో వైస్ ఎంపీపీ దంగేటి వెంకట నాగమణి, పీఏసీఎస్ పర్సన్ సుబ్రహ్మణ్యం (డీఎస్) దంపతులు, మోడేకుర్రులో పార్టీ నాయకుడు మాగాపు చక్రవర్తి భారీ గజమాలలు వేసి, ఘన స్వాగతం పలికారు. గ్రామగ్రామానా పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు డేవిడ్‌రాజుకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, దూనబోయిన నవదీప, కుడుపూడి రామలక్ష్మి, పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు, నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొత్తపేటలో గుర్రపు బగ్గీపై ఊరేగింపుగా సాగుతున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు, మంత్రి తనయుడు శ్రీకాంత్ తదితరులు

సచివాలయాలతో సుస్థిర పాలన

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- పాశర్లపూడిలంకలో సచివాలయ భవనం ప్రారంభం


పాశర్లపూడిలంకలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సుస్థిరమైన, సమర్థవంతమైన పాలన అందిస్తున్నామని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఉద్ఘాటించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షల వ్యయంతో పాశర్లపూడిలంకలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సభలో చిట్టిబాబు మాట్లాడారు. పాలనలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని అన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు తదితర భవనాలు నిర్మిస్తూ, ఆ శాఖలకు చెందిన ఉద్యోగులు గ్రామాల్లోనే ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారని చెప్పారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అది ప్రజల సంక్షేమం కోసమేనని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరెడ్డి అంజిబాబు, పీఏసీఎస్ చైర్మన్ బొరుసు బుజ్జి, ఎంపీటీసీ సభ్యురాలు చెరుకూరి పార్వతీదేవి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, గ్రామ శాఖ అధ్యక్షుడు బాలం రమేష్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి డి.సురేష్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సిద్ధం కావాలి

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా పోటీలకు ఆయా సచివాలయాల పరిధిలోని క్రీడాకారులను సన్నద్ధం చేయాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణ, ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై పీడీలు, పీఈటీలతో వారు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. మండలంలో అనుకూలంగా ఉన్న క్రీడా మైదానాల్లో ఆటల పోటీలు సక్రమంగా నిర్వహించేలా పీడీలు, పీఈటీలు బాధ్యత తీసుకోవాలని అన్నారు. 17 ఏళ్లు నిండిన పురుషులకు, మహిళలకు ఖోఖో, కబడ్డీ, షటిల్, క్రికెట్, వాలీబాల్ పోటీలు గ్రామ స్థాయిలో నిర్వహించాలని చెప్పారు. ఇందుకు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు అనువుగా లేకుంటే సమీప క్రీడా ప్రాంగణాలను ఎంపిక చేసి, క్రీడాకారులను సన్నద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభ చూపిన వారిని మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని ఎంఈఓ తెలిపారు.

9న జాతీయ లోక్ అదాలత్

కొత్తపేట: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చే నెల 9న స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ కె.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

నాయీ బ్రాహ్మణుల అర్ధనగ్న ప్రదర్శన

మామిడికుదురు: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం కేశఖండన శాలలో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కత్తి డౌన్ చేసి, విధులు బహిష్కరించి వారు చేస్తున్న ఆందోళన నాలుగో రోజుకు చేరింది. జీఓ 110 అమలు చేయాలని, దానికి అనుగుణంగా కల్యాణ కట్టలో పని చేస్తున్న 37 మంది నాయీ బ్రాహ్మణులకు ప్రతి నెలా రూ.20 వేల చొప్పున వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు నాలుగు నెలల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ, పాత గుడి వద్ద ఉన్న కల్యాణ కట్ట వద్ద వారు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఆందోళనలో సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు నాగ వీర వెంకట సత్యప్రసాద్, కార్యదర్శి పసలపూడి వీర వెంకట దుర్గారావు, గౌరవాధ్యక్షుడు కాజులూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి రామేశ్వరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

రావులపాలెం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకున్న ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ సతీష్‌లను ఎస్టీయూ మండల శాఖ తరఫున ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కేవీ శేఖర్, జి.నాగేశ్వరరావు, పి.మరియన్‌రాజు, కె.స్టీవెన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ డీజీపీ శ్రీధర్‌రావుకు సత్కారం


అడిషనల్ డీజీపీ శ్రీధర్‌రావును సత్కరిస్తున్న సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: న్యూఢిల్లీ అడిషనల్ డీజీపీగా పని చేస్తున్న ఎస్.శ్రీధర్‌రావును డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అమలాపురం రూరల్ మండలం జనుపల్లెలో మంగళవారం ఘనంగా సత్కరించారు. స్వగ్రామం జనుపల్లెకు అడిషనల్ డీజీపీ శ్రీధర్‌రావు వచ్చిన సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు, కార్యదర్శి తెన్నేటి రాజబాబు ఆధ్వర్యంలో జిల్లా సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మడికి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు పీజే బెల్లీ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కృషి

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సంభవించే సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కృషి చేస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర (డీఎంహెచ్ఓ) అన్నారు. చొప్పెల్ల పీహెచ్‌సీలో మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో తరచూ పర్యటిస్తూ, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మూలస్థాన అగ్రహారంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్య సేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. దోమల నివారణలో భాగంగా గంబూషియా చేపలను స్థానిక మహాలక్ష్మి చెరువులో డీఎంహెచ్ఓ దుర్గారావు సమక్షంలో సర్పంచ్ దంగేటి చంద్రకళ, వైద్యాధికారి డి.సువర్చలా నాయుడు వదిలారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి పి.సత్యనారాయణ, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


చొప్పెల్లలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ దుర్గారావుదొర

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


రావులపాలెంలో క్రీడాకారులు, వారి తల్లులకు సన్మానం


రాజోలులో విజేతకు ప్రశంసాపత్రం అందిస్తున్న నాయకులు


అంబాజీపేటలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం సాయిరామ్

రావులపాలెం/రాజోలు/ఆలమూరు/అంబాజీపేట: జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజేశారు.

- రావులపాలెం మండలం ఈతకోట హైస్కూల్‌కు విద్యార్థులు సీహెచ్ లక్ష్మీసాయిశ్రీ, బి.రోహిత్ సాయికృష్ణలు ఈ నెల 22, 23 తేదీల్లో గుంటూరులో జరిగిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపారు. వారిని, వారి తల్లులో లోవకుమారి, మహాలక్ష్మిలను జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీ కృష్ణారెడ్డి, పీఈటీ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- రాజోలు డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి అధ్యాపకులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనివర్సిటీ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సర్పంచ్‌లు రేవు జ్యోతి, కట్టా శ్రీనివాసరావు, నక్కా రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, పీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పితాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
- ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అప్పాజీ ఆధ్వర్యాన విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు తన తండ్రి వెంకటేశ్వర్లు పేరిట సుమారు రూ.15 వేల విలువైన బహుమతులు అందజేశారు.
- అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కదలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి ఆధ్వర్యాన విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు స్థానికుడు అరిగెల చిన్ని రూ.7 వేల విలువైన మెమెంటోలు అందజేశారు. రిటైర్డ్ పీఈటీ నడిమింటి సుబ్బారావును సత్కరించారు. అనంతరం పీడీ ఆదిలక్ష్మి పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించిన పిరమిడ్‌లు పలువురిని ఆకట్టుకున్నాయి.

యానాం – విజయవాడ ఆర్టీసీ సర్వీసు

యానాం: ఈ ప్రాంత ప్రయాణికులు, వ్యాపారస్తుల సౌకర్యార్థం బుధవారం నుంచి యానాం – విజయవాడ మధ్య అల్ట్రా డీలక్స్ బస్ సౌకర్యం కల్పిస్తున్నట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యానాంలో ఉదయం 5.50 గంటలకు బయలుదేరి అమలాపురం, రాజోలు, నర్సాపురం, బంటుమిల్లి, మచిలీపట్నం మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. అదేవిధంగా మరో బస్సు విజయవాడ నుంచి ఉదయం 6.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.10 గంటలకు యానాం చేరుకుంటుందన్నారు.